ప్రేమ దొంగలు

నెల్లిమర్ల మిల్లు సాయంకాలపుకూత చెవులు గింగురుమనేటట్టు కూసింది.

చంద్రమ్మ వులికిపడి ఇసకతిన్నె మీదనుంచిలేచి, ఏటిలోకి దిగి—కడవముంచుతూ—ఆవైపేచూస్తూ, ఎట్టకేలకు, కడవను మోకాలిమీద పెట్టుకుని, ఎదటి ఎర్రని ఆకాశంవైపూ—ఏటిగట్టుమీద మనుష్యులు నడిచే కాలిబాటవైపూ—వెనక్కి తీసుకోలేని చూపులతో చూస్తూ, మజుందారు Lost heart అనే బొమ్మలా అట్లాగే కొంతసేపు నిలిచిపోయింది.

కొంతసేపటికి కడవబుజానికెత్తుకుని ఏటిగట్టు మీదుగా మిల్లు కూలీల ఇళ్లవెంపు చంద్రమ్మ తొందర తొందరగా నడిచిపోతోంది.

ఒక రైలు. మహావేగంగా—పొగలు కక్కుకుంటూ ఏటి వంతెనమీద గుండెలదిరే చప్పుడుచేస్తూ వెనక్కి విజయనగరంవైపు పరుగెత్తుతోంది చంద్రమ్మ హృదయంలా.

ఆమె నడకలో ఏదో తొట్రుపాటు కనబడుతోంది. అంత చక్కని పాదాల్లో, ఒయ్యారం కనపడవలసిన దానికి బదులు, ఏదో అపశ్రుతిలాంటి ఖంగారు—వినపడుతోంది.

ఆమె వెళ్లి వెళ్లి ఒక తాటాకు ఇంటిముందు ఆగి, కడవ దించుకొని చిన్నఅరుగుమీదపెట్టి, ఎందుకో నాలుగు వైపులా చూచి గుండెదిటవుచేసుకుని తలుపుతీసి నీళ్లుఇంటిలో

పెట్టింది. అరుగుమీద ఉన్న పొయ్యిలో నిప్పువేసి, కూటికుండ కడిగి— అందులో బియ్యంవేసి నీళ్లు పోసింది. నీటిమీద ఏటిగట్టుమీది సిరిశపుపూలుపడి సన్నని రేకులన్నీవిడి నిర్మల మైన నీటిని కలుషితంచేశాయి. విసుగ్గా వాటినన్నిటినీ తీసి వేసి, కుండను పొయ్యిమీదపెట్టి మంటచేస్తూ అరుగుమీద కూర్చుంది.

కాని—

తన స్వచ్ఛమైన మనస్సులో నాలుగు రోజులనుంచి పడుతూ కలచివేస్తూన్న ఆరంగురంగు కోరికలను—అనుభవాలను— ఎట్లాచేత్తో తీసి పారవేయడం?

అబ్బ!

మిల్లుకూత ఎంతహడావడి చేసింది! మిల్లు కుయ్యగానే సోములు ఇంటికి పరుగెత్తుకు వచ్చినట్టు, ఇంటిదగ్గర తాను సమయానికి లేనందుకు ధుమధుమలాడుతూ ఏదో అనుమానమే పడ్డట్టు, తోచి, నాలుగడుగుల్లో, ఇంటికివచ్చి పడింది.

ఛీ వెధవమనస్సు—ఎంతఖంగారు పెడుతుంది! మనిషిమీద మనస్సు ఎంత అధికారం చలాయిస్తుంది. సోములింకా రానేలేదు.

ఈ పాడుతాటాకుఇల్లూ—కోడిపిల్లలూ—మసికుండలూ— గంజికూడూ—మిల్లుకూలి సోములూ ఏమైపోతారో అని పరుగెత్తుకు వచ్చింది. పాపం. ఈ మిల్లునూ—కూలీలనూ అందులో ముఖ్యంగా సోముల్నీ ఈ ఏరు ఒకనాడు చెప్పకుండా హఠాత్తుగా పొంగివచ్చి ఎత్తుకుపోతే బాగుండిపోను.

అన్నంత కోపం వచ్చింది.

నాలుగు రోజులక్రితం వరకూ—ఈ ఏటిబడ్డున చల్లని నిద్రగన్నేరు చెట్లకింద ఊరికి దూరంగాఉన్న కాపరం, ఏట్లో నీటిమీాద ఎగిరే ఏట్రింతల పాట—నీట్లో ఈదే బాతుల చిత్రమైన బొంగురు గొంతుకులు—సాయంత్రం మిల్లు పనిలో నలిగి వచ్చిన సోములు మామకు, వేణ్ణీళ్లుకాచి పోస్తూ, కండలు తేరి, బలిష్ఠమైన అతని ఒళ్ళు, నిమురుతూ, ఏవో సాంసారికపు కష్టసుఖాలు, మాట్లాడుకునేప్పటి హాయీా, అతని బుజాలకు తగులుతూ, కూర్చుని, ఈ ఏటిబడ్డున—ఇసకలోనూ గడిపిన రాత్రులూ—ఎంత బాగున్నాయి!

ఇప్పుడంతా విషంలా ఉంది.

ఈ సోములో — కూలీతో — గడపడం చేదుచేదుగా గొంతుదిగడంలేదు.

రేపు సాయంత్రందాకా ఇంతే—

రామ తీర్థాల నల్లకొండలాగ ఈ రాత్రంత గడవాలి. రేపు పగలంతా తరగాలి. పొద్దు తిరగాలి.

అప్పుడు—ఆ నాజూకు దొరబిడ్డ కనుచూపులో కనపడే ఏటి మలుపుదగ్గర తురాయి చెట్లచాటుకు వచ్చి ఈలవేస్తాడు. ఏదో పాట పాడుతాడు.

అదీగుర్తు!

ఆ ఈల వినగానే శరీరానికి కొత్తగా రెక్కలు మొలిచి నట్టు—మనస్సు పువ్వుల్లో తేలిపోతూన్నట్టు అనిపించి చేతిలో

ఏదిఉంటేఅది విసిరేసి, అడ్డుగా ఉన్నదాన్ని తోసేసి, పట్టరాని ఉల్లాసంతో, పరుగెత్తబుద్ధి—గదా.

పరుగు పరుగున తురాయిచెట్ల దగ్గరకువెడితే కనపడడు. తీగతీగా ఆకుఆకూ వెదుకుతూ ఉండగా ఏపొదలోనుంచోవచ్చి, హాఠాత్తుగా కౌగలించుకుంటాడు. ఎంతమంచిబట్టలు తొడుక్కుంటాడు! బట్టలన్నీ ఎంచేతో ఘుమఘుమ లాడుతూ ఉంటాయి.

నాచేతిలో కడవ ఊడలాగి దూరంగా నీటిలోకి విసురుతాడు. పగిలిపోతుందేమో అనే నా భయంచూసి పదికుండల ఖరీదిదిగోఅని డబ్బులు ఇవ్వబోతే అతనిదర్జా నాకూ వచ్చినట్టుంటుంది. డబ్బులు పుచ్చుకుని ఇసకలోకి విసిరితే నవ్వుతూ నా చేతులు ముద్దుపెట్టుగుంటాడు. నేనేవరి జేబులో వేస్తాను. తానేవెళ్లి కడవ తెస్తాడు. ఇసకలో ఆట. గంటలకొద్దీ ఎంత తియ్యగా మాటలాడుతాడు. ఎప్పుడూ వినని కొత్తసంగతులు. తనకు రెండు మేడలున్నాయట. తనను నాటకంలో వేషం వెయ్యమని రోజూ పెద్దపెద్ద ఊళ్లనుంచి వంద ఉత్తరాలు ఒస్తాయట. నాటకానికి వంద రూపాయలు పుచ్చుకుంటాడట. నాటకంఅంటే ఏమిటో?

తానుపెళ్లి చేసుకోలేదు తగినపిల్ల దొరకక. ఇంతవరకూ ఏపిల్లనూ కన్నెత్తి చూడలేదట. నా అదృష్టం పండింది. ఆ పట్టు బట్టలు, దర్జా, బారీ, చూస్తే నిజంగా దొరబిడ్డ అనిపిస్తుంది.

పెళ్ళీ—మగడూ అంటే వెక్కిరింతగా నవ్వుతాడు. చిన్న బోతే ముద్దు పెట్టుకుంటాడు. ఒళ్ళంతా వెచ్చగా అయి పోయి ఎటో తేలిపోతూ ఉంటుంది. అందం ఎక్కడ ఉన్నా పువ్వులతో పూజ చేస్తారు.

ఈ మాటలతో మనస్సు రెక్కలు కట్టుకుని అతడితో ఎగిరి పోతుంది.

కష్టమాత్రం తాటాకు కొంపకు చేరుతుంది. సోములు పీక్కుపోయిన మొహంతో అమాయికంగా కనిపిస్తాడు. ఏమీ తెలియదు. పగలంతా మిల్లు పనిచేసి సాయంత్రానికి కొంప జేరి 'చంద్రా—కూడెట్టు' అని తిని పడుకుంటాడు. జాలి వేస్తుంది. ఏం చెయ్యను?

పరధ్యానంలో ఈ ఊహా ప్రవాహం విడివడింది. ఎసరు బుసబుస పొంగి పోయి నిండా పడింది. విసుక్కుంటూ తిట్టు కుంటూ మళ్ళా తంటాలు పడి వంట చేసింది.

సోములు వచ్చాడు.

చామనచాయగా పొడుగుగా ఉంటాడు. సంస్కారహీన మైనా బలమైన చిక్కని శరీరం. కూలీలు తొడుక్కునే మూడు కుట్ల చిన్న చొక్కా తొడుక్కున్నాడు. కళ్ళల్లో బాధా, ఓర్పూ, అమాయికం వేరువేరుగా కాపరం చేస్తున్నాయి.

నెమ్మదిగా ఇంటిలోకి వెళ్ళి చొక్కా తీసి, ఒక తాటికమ్మ కాడకు తగిలించి, పాతగుడ్డ ఒకటి పై మీద వేసుకుని, వాకిట్లోకి వచ్చాడు.

"కాసిని ఉడుకునీళ్లు ఇలా తెచ్చిపెట్టు. ఈ పొద్దుచాలా బద్ధకంగా ఉంది" అన్నాడు.

చంద్రమ్మ ఇదివరకు వేణ్ణీళ్ళు పెట్టేది. ఈ వేళ లేవు. వంటకే పొద్దుపోయింది. పరధ్యానంగా ఉండడాన్ని పొయ్యి రెండుసార్లు మంటచెయ్యవలసి వచ్చింది.

"ఈయేళ, కూడుడకడవేఁ, గగన, నైౖపోయింది.

ఏటికెళ్ళు. రేపునుంచి కాస్తాలే—" అంది.

సోములు మారుమాటాడకుండా ఏటికెళ్లి వచ్చాడు. "చంద్రా! చింతాకు పచ్చట్లో ఉప్పొగల్లే నేదు... ఈ పులుసులో తాలింపు లేదు...ఏటే ఈ వంటా?" అన్నాడుపాపం దాగలో పెట్టిన కూడు నములుతూ.

"..........."

"..........."

"మావాఁ! ఈ పొద్దు, నాకు, తలనెప్పిగా, వుంది... అవతలరుగుమీద ఆ, నులకమంచం, వాల్చుకు, పడుకో,... చాపగుడ్డేసుకుని, నేనీ అరుగుమీద ఒరుగుతా" అంటూ ఈత పాతచాప తీసింది చంద్రమ్మ.

2

శ్రీచిట్టి వెంకటసీతారామచంద్రబాబు మొన్న మొన్ననే చిదికిపోయిన శృంగివలస కలింగజమిందారీ కుటుంబానికి చెందినవాడు. ఆయన్ని మిత్రులూ చనువైనవారూ క్లుప్తంగా రాంబాబు అంటారు.

'డాయూ ప్యారీ' లకు, సీమకుక్క లకు, గుఱ్ఱపుపందాలకూ, దినదినమూ కొత్తచవులూరించే శోభన దేవతలకూ, జమీందారీఅంతా ఆహుతిఐపోగా చెడగా మిగిలిన సుకుమార శరీరంతోనూ, ఒకపాటి కూని రాగంతోనూ శ్రీరామచంద్ర బాబుగారు ఆంధ్రలోకంమీదపడ్డారు. ఏఉద్యోగం సంపాదించా లన్నా దరిద్రగొట్టు చదువొకటి అడ్డంవచ్చింది. ఎట్లాగో లోకాన్ని కొట్టుకుతినాలి. తప్పదు ఇక—అన్ని తరహాలకూ—ముతాలకూ, ఆతిథ్యంఇచ్చి ఎప్పుడూ సింహద్వారం తెరచి ఉంచింది ఒక్క—నాటకరంగం దానికడుపు చల్లగా—కనపడింది.

శ్రీరామచంద్రబాబుగారికి నాట్యకళను చేపట్టాలని బుద్ధి తిరిగేటప్పటికి, సరిగ్గా అదే సమయంలో విజయనగరంలో ఉద్భవించిన ఆంధ్రరంగోద్ధారక నాట్యమండలివారు శ్రీరాం బాబుగారిని ఆహ్వానించి ఆరునెల్లు ఉచ్చారణ నేర్పి మంచి అభినేతగా తయారుచేశారు. ఆయన దేశంలో పలుతావుల తన అభినయకౌశలం చూపి 'శృంగారరంగ' అనే బిరుదం పొందారు. ఇప్పుడుచాలామంది స్నేహితులు ఆయన్ను ఆబిరుద నామంతో 'రంగబాబు' అంటారు.

రంగోద్ధారక నాట్యమండలివారి నాటకాలుసుమారు రెండు నెలలనుంచి ముమ్మరంగా జరిగాయి. కంపెనీ మానేజరుగారు మరిరెండు నెలలవరకూ నాటకాలువెయ్యము, అని నటులు తమతమ గ్రామాలకు వెళ్లిరావచ్చుననిచెప్పి, తలో 50 రూపా యలుఇచ్చి, పంపివేశాడు. రంగబాబు శృంగివలస వెళ్లదలచి

పోనీ ఒకసారి వెల్లి మర్లలో ఉన్న మిత్రుణ్ణి చూచి మరీస్వగ్రామం వెళ్లవచ్చునని నిశ్చయించి నాలుగు రోజులయింది నెల్లిమర్ల వచ్చాడు.

స్నేహితుడుచాలా సంతోషించి రంగబాబును వారంరోజుల వరకూ తనవద్ద ఉండిపోవాలని బలవంతంచేశాడు. రంగబాబు మిత్రుడిమాట తీసివేయలేక ఆగాడు. మిత్రుడు ఏదో కొందర పనిమీద గ్రామాంతరం వెళ్ళుతూ సాయంత్రానికి తిరిగివస్తా నని చెప్పాడు.

రంగబాబు కొంతసేపు ఏదో పుస్తకం చదివి—విసుగు రాగా—ఏటి ఒడ్డుకు షికారు వెళ్లాడు.

మార్చినెల. ఏరు తక్కువనీటితో ఇసక పొరలమీదా—గులక రాళ్లమీదా స్వచ్ఛంగా పారుతోంది. కొద్దిగా వెచ్చగిలే ఎండ. చురికి అప్పుడే చల్లబడుతోంది. మంచిగాలి తిరిగి ప్రాణం లేచివస్తోంది. రంగబాబు నీటికి దగ్గరగా ఇసకలో కూర్చుని ఒక నాటకంపాట సన్నంగా అందుకున్నాడు. సాయంకాలపు గాలికెరటాల్లో ఆ పాట పరుగెత్తి మొగలి పూల పరిమళంలా ఎక్కడ ప్రాణిఉన్నా పట్టి ఆపుతోంది. చుట్టూఉన్న ఆకాశం ఆనందపులకితమై— ఆ పాట నొక్కుల హాయికి కరిగిపోయింది.

సరిగ్గా అదే సమయంలో అనతిదూరంలో ఉన్న రేవులో కడవతో నీరు ముంచుకోడానికి వచ్చింది ఆ పల్లెటూరి పడుచు చంద్రమ్మ.

నల్లచుక్కలచీరా — సెనగపువ్వులరైకా తొడుక్కుంది. నల్లని కేశపాశంలో ఒక తురాయిపువ్వు, ఒక సిరిశపు పువ్వూ, పెట్టుకుంది. అస్తమించే సూర్యకాంతిలో ఆమె శరీరంలోని యౌవనం మెరుస్తోంది.

చంద్రమ్మ కడవముంచి మోకాలిమీద ఉంచింది. కాని బుజానికెత్తుకోలేదు. ఆ పాట వింటూ అతన్ని చూస్తూ బాహ్యప్రపంచం మరిచిపోయింది.

రంగబాబు పాట ఆపి ఆమెను చూచాడు. ఆ చక్కని పల్లె పడుచు అంతవరకూ తనవైపు చూస్తూ — తాత్కాలికంగా చూపులు తిప్పుకోవడం గమనించాడు. రంగబాబు పెద్ద జమీందారుబిడ్డ. చెప్పదగ్గ స్త్రీవేటగాడు. వలరాజు వల ఒక్క సారి ఎరువుపుచ్చుకు బయలుదేరాడు.

హఠాత్తుగా అతడు సమీపించేసరికి ఆమె కడవ పట్టుకుని ఇసక తిన్నెమీదకు వచ్చింది.

"పిల్లా — పాపం ఒక్కర్తెవూ — కడవ బుజానికి ఎత్తమన్నావా?" కడవ ఎత్తబోయాడు.

కనుకొలకుల్లోంచి అసాధారణంగా చూస్తూ — "వద్దండీ — వద్దు, మాకు అలవాటే — ఒంటిగా ఎత్తుకోవడం" ఆకుచాటు మల్లెపూవులా సిగ్గులో కులికింది.

అతడు వినిపించుకోలేదు. కడవపట్టి బుజానికెత్తాడు. ఆమె వద్దువద్దంటూ కడవ బుజానికెత్తుకుంది.

అతలి మెత్తనివేళ్లు తగిలి ఆమె చెయ్యి ఒణికింది. కుండలో

నీళ్లు తొణికి ఆమె అవికకొంచెం తడిసింది.

"అరే—నీళ్లుజారి తడిసిందా" నవ్వాడు.

"పోనీ... లెండి..." కోపంతో తీపిగానవ్వింది. అర్థమయింది.

ఎవరితోవల్లో వాళ్లు నడచివెళ్లారు.

3

తెల్లవారితే స్వగ్రామం వెళ్లిపోవాలి. రంగబాబు శరీరం ముందుకు—మనస్సు వెనక్కు—ఏమీ పాలుపోవడంలేదు. వచ్చి ఆరురోజులైంది. సాయంకాలమయేసరికి ఏటిబడ్డు ఒక రసవద్రంగ స్థలంలాఉంది. ఈరోజునఏదోఒకటి తేల్చుకోవాలి.

ఆ రోజు పగలెట్లాగో గడిచింది.

సాయంకాలమయింది. రంగబాబు క్రాపుచక్కగా దువ్వుకుని—లేతఊదాసిల్కులాల్చి తొడుక్కుని—పట్టుగళ్లలుంగీ కట్టుకుని కొత్తరకం చెప్పులు తొడుక్కుని ఈ రెండ, ఉండగానే ఏటిబడ్డు తురాయి చెట్లదగ్గరకుచేరి, కొంతసేపు, పచారుచేసి, ఇసకలో, కూచున్నాడు. ఒరిగాడు, తురాయి పువ్వుల, ఈనెలు, లెక్కపెట్టాడు. గట్టిగా, చూపుడువేలూ, బొటనవేలూ, వల యంగాచేసి, నాలికకింద పెట్టి, ఊదాడు, మిల్లుకూలీల ఇళ్ళవైపు చూస్తూ.

"రాత్రిల్లో మనతోటకాడ—ఒకణ్ణే—

నాతిప్పలీశ్వరుడు లేడా" అనే మొంకిపాట అందుకుని ఏటిలోనీరు తాగే ఆవులనూ, నీటిమీద ఎగిరే కాటుకపిట్టలను ఆపివేశాడు.

పాటముగియలేదు.

ఆకుపచ్చరంగు నేతచీరకట్టుకుని, బటాణీచుక్కల తెల్ల రవిక తొడుక్కుని తలలో నాగమల్లెపూవులు పెట్టుకొని, నడకనుమించిన తొందర కళ్లలో చూపుతూ వన్నెల చిన్నారి కాపువడుచు చంద్రమ్మ తురాయి చెట్లకిందకువాలి...అప్రయత్నంగానే చప్పట్లు చరిచింది.

అతడు తిరిగి చూడలేదు.

కొండచరియల మీదనుంచి ఒకవింత హొయలుతో జాలువారే సెలయేటి కన్నెలాగు చంద్రమ్మ గట్టుమీదనుంచి ఇసకతిన్నెల మీదకు చట్టున ప్రాకింది. రంగబాబు తెచ్చుకొన్న కోపంతో పెదవులు బిగించుకున్నాడు.

తెల్లబోయింది. కంటనీరు పెట్టుకుంటూ, తన సంసారం, మగడు, చుట్టుపక్కలవాళ్లు, అపకీర్తి, తనమనస్సులో నిత్యబాధా, అన్నీ కోలకళ్లలోంచి జాలిగా చూస్తూ చెప్పింది.

అతడు చంద్రమ్మవైపు తిరిగాడు.

నిగనిగ మెరిసే ఆమెతలనూ, నున్నని ఆమెభుజాలను నిమురుతూ, తలలోని నాగమల్లె పూవులను పుణికి సర్దుతూ, "చంద్రా—రేపుఉదయం నాప్రయాణం—ఇంతకంటె ఇక్కడ ఉండడం కుదరదు. నిన్ను విడిచి వెళ్లాలనిలేదు. వెళ్లినా, కన్నుమూస్తే నువ్వే ఎదురుగాఉంటావు. ఎవరూ ఇంతగా నన్ను స్వాధీనం చేసుకోలేదు......" అని అతడు చెబుతూండగా ముందు చంద్రమ్మ తెల్లబోయి "అప్పుడేనా" అనిగొంతుకులో

ఏదో పట్టుకొన్నట్టు మాటాడలేకపోయింది. రంగబాబు లాలనగా దగ్గరగా జరిగి ఒత్తుగా ఆమెను గుండెలకు హత్తుకొని అన్నాడు.

"ఎందుకిక్కడ? ఈ మొగుడూ, చాలీచాలని గంజినీళ్లూ, కోడిపిల్లలూ, ఛా—ఇక్కడ ఏం బాగుంది? చెప్పు—ఆలోచించుకో—నాతో—ఎన్నో పట్టణాలు—మంచి బట్టలు—నాజూకు వేషం—రాజభోజనం—నిన్ను కాలు కిందపెట్ట నివ్వను. పువ్వుల్లో నడిపిస్తాను. ఏం? తెల్లవారుజామున మొదటి మిల్లుకూతే వెంటనే రోడ్డుపక్క పొదల్లో సిద్ధంగాఉండు." అరచేతిలో స్వర్గం చూపించాడు. చంద్రమ్మ ఎందుకో వెర్రిగా చుట్టూ చూసింది. తన ఇల్లూ—మిల్లూ—పొలాలూ—గిరగిర తిరిగి ఏటిలోకిఒరిగి పోతూన్నట్టు కనిపించి పక్కబోదె ఆనుకుని "అమ్మో—నేను—రాను" అని నీళ్ళుతిరిగే కళ్ళను పక్కకు తిప్పుకుంది.

"నీకూ ఎవ్వారులేరు నాకూ..." అంటూ అతడు చెయ్యి పట్టుకు లేవదీశాడు. ఆమె వెన్నలా కరిగిపోయింది.

4

శృంగివలసలో జమీందారుగారి కూలిపోయేమేడలో ఒక వైపు చిన్న కునికేదీపం, రెండు నులకమంచాలు అప్పుడప్పుడు ఒక చంటిపిల్ల ఏడుపూ నిద్రపోయే ఆభవనం కలవరింతల్లా—గోచరిస్తూంటాయి. పూర్వం పెద్దజమీందారుగారు బాగున్న

ప్పుడు ఆభాగం వేటకుక్కలు కట్టివెయ్యడానికి, బాతులు, కౌజుపిట్టలనివాసానికీ ఉపయోగించేవారు. కనుక ఇంతకుపూర్వం అక్కడ ఎవ్వరూ కాపురం ఉన్నజాడలేదు. ఈమధ్య సుమారు ఏడాదినుంచి ఒకకుటుంబం అక్కడచేరింది.

ఒకనాడు రాత్రిపదిగంటలకు ఆభాగంలో చిన్న కలవరం బయలుదేరింది.

“వారం రోజులనుంచి మాడుతున్నాం—చంటిపిల్లా నేను—మీరు ఒక్కరోజు తాగుడుబుడ్లకు పెట్టేఖర్చు మాకు రెండుమూడురోజులు తిండికిచాలు. నాలుగురోజుల కోసారి మీరు ఇంటికి వస్తూంటే చెప్పుకునే దిక్కుకూడాలేదు. ఎందుకిలా—కోసికోసిచంపడం—ఒక్కసారి నరికి పారెయ్యరాదూ మమ్మల్ని” మాసిన చీరకొంగుతో కళ్ళుతుడుచుకుంటూ అంది. తలఅంతా చిక్కులుపడి చెదిరిపోయి ఉంది. ఖాయిలా పడ్డట్టు చెక్కిళ్ళు పీక్కుపోయాయి. నులకమంచంమీద పది నెల్ల వయస్సుగల చంటిపిల్ల ఏడ్చేఓపికలేక మూలుగుతోంది.

రంగబాబు గోడదగ్గరగా ఉన్న చాపమీదకూచుని ఒక బుడ్డిలోంచి గ్లాసులోకి ఒంచి తాగుతున్నాడు. సమాధానం చెప్పదలచుకున్నట్టులేదు. పదినిమిషాలు గడిచాయి.

“పాలులేని ఈపిల్ల గోడుచూస్తూ నేనింక బతకలేను... ఇక్కడ ఉండలేను...” అందిపాపం పిల్లపక్క మంచంమీద ఒరుగుతూ.

నిషా బాగా నరాల్లో ప్రవేశించింది.

"ఫో... కావలిస్తే... సంపాదించుకు తిను... ఇక్కడ ఉండలేవు... ఔను ఉండలేవు... ఇంకోణ్ణి చూసుకో... బాగా ఉన్నవాణ్ణి... పతివ్రత... పాపం! నేనెన్నో వాణ్ణో..." చంద్రమ్మ తాచులా లేచింది.

"ఇన్నాళ్లూ తిండిలేకపోతే ఓర్చుకున్నాను. గుడ్డపేలికలు కప్పుకొని మానభంగానికైనా వెరవకండా ఓపికపట్టాను... చంటిపిల్ల పాలకేడిస్తే రక్తంబోడిచి బతిగించాను. ఇదంతా నా కోసంకాదు. నీకోసం. నీమీది వల్లమాలిన మోహంకోసం. నాటకాలంటే—కల్లబొల్లి మాటలంటే మోసంచేసి ఎదటివాళ్ళని పడగొట్టడమంటే అప్పుడు నాకు తెలియదు. నీతో ఊళ్ళుతిరిగి రకరకాలమనుషుల్ని చూసి నేనన్నీ నేర్చుకున్నాను.

ఏంలాభం—కళ్లను మిరుమిట్లుగొలిపే నీ డాబువేషాలు, నాటకపుటక్కులు చూసి ఆదిక్కులేని అమాయికుడికి ద్రోహం చేసి వచ్చాను.

అందుకు నేనిప్పుడు విచారించను.

నిన్నేనమ్మి, మోహంచేత, అందనికోరికలు తీసుతాయనే దురాశచేత వచ్చినందుకు ఈనాటికి నోటికివచ్చినట్టూ అన్నావు. కదూ! నేనుతిండికోసం నీతోరాలేదు జ్ఞాపకం తెచ్చుకో. ఆడది మనస్సు ఇచ్చిందంటే తీసుకోడం ఎరగదు. రోజూలక్షగడ్డలు కరుస్తుంది గనక మీమగజాతి, అంతా అట్లాగే అనుకుంటావు—ఇదిగో పోతున్నాను. ఎందుకోసం? తిండి సంపాదించుకోవడంకోసంకాదు. కుక్కలమాత్రం బతగలేకపోము. ఇప్పుడు

నీదయవల్ల...నీకన్న దర్జాగా బతగడం నేర్చుకున్నాను.

ప్రేమపేరుచెప్పి ఏమీఎరగని అమాయికురాళ్ల మానం దోచుకునే నీలాంటిదొంగలను చేతనైనంతవరకూ కసితీరా హింసించడానికి— నేనొక అగ్నిహోత్రాన్నయి—మగమిడతల్ని లాగగలిగినంతగా లాగి బూడిదచేసి మరీఆరిపోతాను ” ఉన్మత్తంగాలేచి ఊడిపోయిన జుట్టుముడి వేసుకుంటూ చంటి పిల్లను ఎత్తుగుంది. రంగబాబు చింతనిప్పుల్లాంటి కళ్లను తీవ్రంగా ఎత్తాడు “నోర్మూయ్—ముండా—లేచివచ్చింవాటికి ఎంత పొగరూ? గుమ్మందాటితే నరికిపారేస్తాను.” అనితూలుతూ లేచి ముందుకునడిచే ఆమెచేయిపట్టుకు వెనక్కు గుంజాడు. ఆమె అతన్ని గోడపైకి ఒక్కతోపుతోసి అడుపులిలా రెండు అంగల్లో వీధిలోకి వచ్చిపడింది.

రంగబాబు విరిగేనిపాలోంచి తెరవలేని కళ్లను తెరవ బోతూ“ సీగతి...అంతే...చావు” అని నీరసంగా మూలిగాడు.

దౌర్జన్యం

“ ఎక్కణ్ణించి—అమ్మాయీ ? ”

“ ...విజయనగరం ”

“ అంటే ? ”

“ .... ”